

మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతిపత్రం అందజేస్తున్న రవిశంకర్ తదితరులు

ప్రైవేట్ రవాణా కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

చిక్కడపల్లి, జూలై 31 (ఆంధ్రజ్యోతి): ఆటోడ్రైవర్లకు ఏటా ఇస్తామన్న రూ. 12 వేలతోపాటు ప్రైవేట్ రవాణా కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కోరుతూ బీఎంఎస్ ఆటో, రవాణా సంఘం ప్రతినిధులు మంత్రి పొన్నం ప్రభాకర్‌ను బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీఎంఎస్ ఆటో, రవాణా సంఘం ప్రతినిధి అల్లూరి రవిశంకర్, లిఖిత్‌కుమార్, ఎండీ హబీబ్, సమ్మయ్యయాదవ్ మాట్లాడారు. ఓలా, ఉబర్, బైకుల నుంచి ఆటోడ్రైవర్లను రక్షించాలని, ఆటో మీటర్ రేట్లు పెంచాలని, గూడ్స్ వాహనాల ఉపాధిని దెబ్బతీసే పోర్టర్‌ను నిషేధించాలని మంత్రిని కోరినట్లు తెలిపారు.

జనాభా దామాషా ప్రకారం..

'ఎస్సీ, ఎస్టీలకు నిధులు కేటాయించాలి'

కవాడిగూడ, జూలై 31 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర బడ్జెట్‌లను సవరించి జనాభా దామాషా ప్రకారం ఎస్సీ, ఎస్టీలకు నిధులు కేటాయించాలని దళిత బహుజనఫ్రంట్ జాతీయ కార్యదర్శి పి. శంకర్ డిమాండ్ చేశారు. బుధవారం లోయర్ ట్యాంక్‌బండ్‌లోగల అంబేడ్కర్ విగ్రహం వద్ద కేంద్ర, రాష్ట్ర బడ్జెట్‌లను సవరించాలని డిమాండ్ చేస్తూ నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చేవేళ్ల డిక్లరేషన్‌లో ఎస్సీ ఎస్టీలకు హామీ ఇచ్చిన పథకాలకు నిధులు కేటాయించలేదన్నారు. దళిత బంధు స్థానంలో అంబేడ్కర్ భరోసా పథకాన్ని ప్రవేశపెట్టి ప్రతి కుటుంబానికి రూ. 12 లక్షల ఆర్థిక సహాయం అందజేస్తామని చెప్పి బడ్జెట్‌లో ప్రస్తావించలేదన్నారు. కార్యక్రమంలో డీబీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సింహ, కేవీపీఎస్ రాష్ట్ర నాయకుడు బాలుపీర్, డీబీఎఫ్ రాష్ట్ర నాయకులు పులి కల్పన, దాసరి ఏగొండ స్వామి తదితరులు పాల్గొన్నారు.



మోహన్‌నగర్‌లో రోడ్డుపై పారుతున్న మురుగు నీరు

మోహన్‌నగర్‌లో రోడ్డుపై నిత్యం మురుగు పరుగు

ముషీరాబాద్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): మోహన్‌నగర్‌లో డ్రైనేజీ మ్యాన్‌హోల్ నిత్యం నిండి మురుగు నీరు రోడ్డుపై పారుతోందని స్థానికులు శ్రీనివాస్, మహేష్ ఆవేదన వ్యక్తం చేశారు. మురుగు నీరు రోడ్డుపై పారుతుండడంతో దుర్వాసనతో ఇబ్బంది పడుతున్నామని, అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని రాకేష్ తెలిపారు. సమస్య శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవడం లేదన్నారు. సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

వ్యవసాయ శాఖలో బదిలీలు చేపట్టాలి

రాంనగర్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యవసాయ శాఖలో పనిచేస్తున్న ఉద్యోగుల బదిలీలు చేపట్టాలని వ్యవసాయ ఉద్యోగుల సంఘం నాయకులు ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ చిన్నారెడ్డి ఆధ్వర్యంలో మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావును బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు డాక్టర్ వైద్యనాథ్ మాట్లాడుతూ.. వ్యవసాయ శాఖలో చాలా కాలంగా ఉద్యోగ బదిలీలు జరగడం లేదని మంత్రికి వివరించామని తెలిపారు. పదోన్నతులు కల్పించమని కోరామన్నారు. మంత్రిని కలిసిన వారిలో సంఘం ప్రధాన కార్యదర్శి కృపాకర్‌రెడ్డి, నాయకులు శశిధర్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుకు వినతిపత్రం అందజేస్తున్న డాక్టర్ వైద్యనాథ్ తదితరులు



ఆర్టీసీ ఉద్యోగుల సన్మాన కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఠా గోపాల్, అధికారులు

ఆర్టీసీ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలి

రాంనగర్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తామని కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీని సీఎం రేవంత్‌రెడ్డి వెంటనే అమలు చేసి ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఎమ్మెల్యే ముఠా గోపాల్ కోరారు. ముషీరాబాద్ డిపో టీఐ నీస నర్సింహగౌడ్, ఏడీసీ ఎం. శ్రీనివాస్, కండక్టర్ బి. ఇస్తారి బుధవారం ఉద్యోగ విరమణ చేశారు. వారిని డిపో అధికారి కల్యాణి ఆధ్వర్యంలో సత్కరించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆర్టీసీతో తనకు అనుబంధం ఉందని, కండక్టర్‌గా, అదే సంస్థ హైదరాబాద్ జోన్ చైర్మన్‌గా పనిచేశానని చెప్పారు. నర్సింహగౌడ్, డి. శ్రీనివాస్, ఇస్తారి 36 సంవత్సరాల పై చిలుకు ఆర్టీసీకి సేవలు అందించారన్నారు. ఆర్టీసీ అధికారి శ్రీనివాస్, ఐఎన్‌టీయూసీ నాయకుడు హనుమంతు ముదిరాజ్, బోడుప్పల్ మున్సిపాలిటీ కార్పొరేటర్లు విజయ్‌గౌడ్, సింగిరెడ్డి పద్మారెడ్డి, అజయ్‌యాదవ్ పాల్గొన్నారు.

విద్యారంగ డిమాండ్లను అసెంబ్లీలో ప్రస్తావించాలి

రాంనగర్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): విద్యారంగ డిమాండ్లు, సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావించాలని మాజీ మంత్రి హరీశ్‌రావును పీడీఎస్‌యూ నాయకులు కోరారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లకు నిధులు విడుదల చేయడంతోపాటు బడ్జెట్‌లో విద్యారంగానికి 30 శాం నిధులు కేటాయించాలని, యూనివర్సిటీలకు వైస్‌చాన్స్‌లర్‌ల పోస్టులను భర్తీ చేయాలనే అంశాలను అసెంబ్లీలో ప్రస్తావించాలని కోరుతూ పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు మధు, నాగరాజు హరీశ్‌రావుకు బుధవారం వినతిపత్రం అందజేశారు.



హరీశ్‌రావుకు వినతిపత్రం అందజేస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

11న సాంస్కృతిక, సాహిత్య పోటీలు

రాంనగర్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆగస్టు 11న బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్యవిజ్ఞాన కేంద్రంలో సర్వేజన సుఖినోభవంతి సంస్థ ఆధ్వర్యంలో సాంస్కృతిక, సాహిత్య పోటీలు నిర్వహిస్తున్నట్లు సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ ఇ.ఎస్.ఎస్.నారాయణ తెలిపారు. పోటీలను కిడ్స్, సబ్ జూనియర్, జూనియర్స్, సీనియర్స్, సూపర్ సీనియర్స్ విభాగాల వారీగా నిర్వహించి విజేతలకు బహుమతులు, సర్టిఫికెట్లు అందజేస్తామని పేర్కొన్నారు.

ఆసక్తిగల వారు ఈనెల 10వ తేదీలోపు 9652347207 ఫోన్ నంబర్‌లో సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవచ్చన్నారు.

గంగపుత్రులకు అన్యాయం చేసే విధంగా..

కేటీఆర్, వివేకానంద్ వ్యాఖ్యలు

కవాడిగూడ, జూలై 31 (ఆంధ్రజ్యోతి): ముదిరాజ్‌లను బీసీ-డి గ్రూపు నుంచి బీసీ-ఏ గ్రూపులో చేర్చాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ చేసిన వ్యాఖ్యలను ప్రదేశ్ గంగపుత్ర సంఘం, బీసీ-ఏ కులాల హక్కుల పరిరక్షణ సమితి నేతలు తీవ్రంగా ఖండించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 30 లక్షల మంది గంగపుత్రుల మనోభావాలను దెబ్బతీసే విధంగా బీఆర్ఎస్ నేతలు వ్యాఖ్యలు చేయడం దారుణమన్నారు. కేటీఆర్, వివేకానంద్ తమ వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. బుధవారం లోయర్ ట్యాంక్‌బండ్‌లోని బండమైసమ్మనగర్‌లో తెలంగాణ ప్రదేశ్ గంగపుత్ర సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అధ్యక్షుడు గడప శ్రీహరి, బీసీ-ఏ కులాల హక్కులపరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ బాగయ్య, తెలంగాణ ప్రదేశ్ గంగపుత్ర యువజన సంఘం అధ్యక్షుడు అంబటి మల్లయ్య సుధాకర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గడప శంకర్, దీటి సత్యనారాయణ మాట్లాడారు. పదేళ్లపాటు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ నాయకులు గంగపుత్రులు రాజకీయంగా ఎదగనీయకుండా కుట్రలు చేశారని ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రజా ప్రతినిధులు గంగపుత్రులకు అన్యాయం చేసే విధంగా అసెంబ్లీలో మాట్లాడటం సిగ్గుచేటన్నారు. సమావేశంలో గంగపుత్ర సంఘం, తెలంగాణ బీసీ-ఏ కులాల హక్కుల పరిరక్షణ సమితి నేతలు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న గంగపుత్ర సంఘం నాయకులు

స్మితా సబర్వాల్‌ను తొలగించాలంటూ నిరసన

కవాడిగూడ, జూలై 31 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులను అవమానపరిచిన ఐఏఎస్ అధికారి స్మితా సబర్వాల్‌ను వెంటనే విధుల్లో నుంచి తొలగించి ఆమెను అరెస్ట్ చేయాలని అఖిల భారత దివ్యాంగుల హక్కుల వేదిక జాతీయ అధ్యక్షుడు కొల్లి నాగేశ్వర్‌రావు డిమాండ్ చేశారు. బుధవారం లోయర్‌ట్యాంక్‌బండ్‌లో గల అంబేడ్కర్ విగ్రహం వద్ద అఖిల భారత దివ్యాంగుల హక్కుల వేదిక ఆధ్వర్యంలో దివ్యాంగులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్మితా సబర్వాల్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్మితా సబర్వాల్‌కు నోటీసులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోతే పెద్దఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. నిరసన కార్యక్రమంలో అఖిల భారత దివ్యాంగుల హక్కుల వేదిక నాయకులు జంగల్ శ్రీనివాస్, పి. శ్రీనివాస్, పులిపాటి శ్రీనివాస్, మల్లెల డేవిడ్, నరసింహారెడ్డి, మాధవి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



లోయర్ ట్యాంక్‌బండ్‌లో అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న కొల్లి నాగేశ్వర్‌రావు, దివ్యాంగులు

వ్యవసాయ రంగానికి నిధుల కేటాయింపులో అన్యాయం

రాంనగర్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ రంగానికి బడ్జెట్‌లో నిధుల కేటాయింపులో అన్యాయం చేసిందని నిరసిస్తూ సంయుక్త కిసాన్‌మోర్చా ఆధ్వర్యంలో బుధవారం బాగ్‌లింగంపల్లిలో సుందరయ్యపార్కు వద్ద కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ పత్రాలను దహనం చేశారు. ఈ సందర్భంగా సంయుక్త కిసాన్‌మోర్చా రాష్ట్ర కన్వీనర్లు టి. సాగర్, పశ్యపద్మ, ప్రభాకర్, భిక్షపతి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ అనుకూల విధానాలను విడనాడి వ్యవసాయ రంగం, రైతాంగాన్ని కాపాడేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. వ్యవసాయ రంగానికి నిధులు పెంచాలని, కనీస మద్దతు ధరల చట్టం, రుణమాఫీ చేయాలని, ఎరువుల సబ్సిడీ కొనసాగించాలని, ఉపాధి హామీ పథకానికి నిధులు పెంచాలని డిమాండ్ చేశారు. పరిశోధన రంగాన్ని కార్పొరేట్ విత్తన కంపెనీలకు అప్పగించవద్దన్నారు. ఎం.భిక్షపతి, ఆర్. వెంకటేష్, రాములు, కిరణ్, కనిగంటి రవి, జంగారెడ్డి, శోభన్ పాల్గొన్నారు.



కేంద్ర బడ్జెట్ ప్రతులను దహనం చేస్తున్న కిసాన్ మోర్చా నాయకులు

కులగణనపై బీజేపీకి చిత్తశుద్ధి లేదు

రాంనగర్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): బీసీ కులగణన ప్రక్రియను వెంటనే చేపట్టాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎర్ర సత్యనారాయణ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. బుధవారం విద్యానగర్‌లోని బీసీ భవన్‌లో జరిగిన కులగణన - ప్రభుత్వాల చిత్తశుద్ధి అనే అంశంపై సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. కులాలు లేనివారే కులగణన కోరుతున్నారని పార్లమెంట్‌లో కేంద్రమంత్రి వ్యాఖ్యలు చూస్తుంటే బీజేపీకి కులగణనపై చిత్తశుద్ధి లేదని స్పష్టమవుతుందన్నారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో కులగణన చేయాల్సిన అవసరం ఉందని మాట్లాడిన బీజేపీ, కాంగ్రెస్‌తో పాటు బీఆర్ఎస్ కూడా ఆ అంశంపై మాట్లాడకపోవడం బీసీలను మోసం చేసినట్లేనన్నారు. బీసీ రిజర్వేషన్లను 42 శాతం పెంచిన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలన్నారు. లేనిపక్షంలో బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఉద్యమం చేస్తామని ఆయన హెచ్చరించారు. సమావేశంలో బీసీ సంఘాల నాయకులు టి. రాజ్‌కుమార్, జిల్లపల్లి అంజి, వేముల రామకృష్ణ, హరికృష్ణ, ప్రీతమ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎర్ర సత్యనారాయణ

డ్రగ్స్ బారిన పడితే జీవితం అంధకారమే

- ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ కమలాసన్‌రెడ్డి
- రేవ్‌పార్టీ నిందితులకు తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సెలింగ్

హైదరాబాద్ సిటీ/ఘట్‌కేసర్ రూరల్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): డ్రగ్స్ బారిన పడితే జీవితం అంధకారం అవుతుందని తల్లిదండ్రులు, పిల్లలు తెలుసుకోవాలని ఎక్సైజ్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ వి.బి.కమలాసన్‌రెడ్డి సూచించారు. ఇటీవల మాదాపూర్ రేవ్‌పార్టీలో డ్రగ్స్ వినియోగిస్తూ ఎక్సైజ్ పోలీసులకు చిక్కిన నిందితులకు తల్లిదండ్రుల సమక్షంలో బుధవారం కౌన్సెలింగ్ చేశారు. భవిష్యత్తులో డ్రగ్స్ మహమ్మారి జోలికి పిల్లలు వెళ్లకుండా చూస్తామని హామీ ఇస్తేనే విముక్తి కల్పిస్తామన్నారు. ఇక నుంచి పిల్లలను జాగ్రత్తగా చూసుకుంటామని తల్లిదండ్రులు, కుటుంబసభ్యులు హామీ ఇచ్చారు. అబ్కారీ భవన్‌లో జరిగిన కౌన్సెలింగ్‌లో ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ జాయింట్ కమిషనర్ ఖురేషి, అడిషనల్ ఎస్పీ భాస్కర్‌గౌడ్, ఎస్ఎఫ్‌టీ టీమ్ లీడర్ ప్రదీప్‌రావు, డీఎస్పీ తుల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మద్యం వినియోగిస్తే అనుమతి తప్పనిసరి

ఫంక్షన్ హాళ్లు, రిసార్టుల్లో నిర్వహించే బర్త్‌డే పార్టీలు, ఇతర శుభకార్యాల్లో మద్యం వినియోగిస్తే తప్పనిసరిగా ఎక్సైజ్ శాఖ అనుమతి తీసుకోవాలని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ వీబీ కమల్‌హాసన్‌రెడ్డి సూచించారు. 'ఆంధ్రజ్యోతి'లో మంగళవారం ప్రచురితమైన 'రిసార్ట్‌పై దాడి.. ఇద్దరిపై కేసు నమోదు' వార్తకు ఆయన స్పందించారు.

మేడ్చల్ జిల్లా అంకుషాపూర్‌లోని ది కాంటినెంటల్ రిసార్ట్‌లో సోమవారం అర్ధరాత్రి బిగ్‌బాస్ ఫేమ్ మహబూబ్ ఇచ్చిన బర్త్‌డే పార్టీలో టీవీ నటులు, సెలబ్రిటీలు పాల్గొని అనుమతి లేకుండా మద్యం వినియోగించిన విషయం తెలుసుకున్న ఎక్సైజ్ పోలీసులు ఇద్దరిపై కేసు నమోదు చేశారు.

పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా గెలిపించండి

ముషీరాబాద్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): పద్మశాలి సంఘం ఎన్నికల్లో రాష్ట్ర అధ్యక్షుడిగా తనను గెలిపించాలని గ్రేటర్ హైదరాబాద్ పద్మశాలి సంఘం అధ్యక్షుడు వల్లకాటి రాజ్‌కుమార్ విజ్ఞప్తి చేశారు. బుధవారం పద్మశాలి సంఘం భోలక్‌పూర్ అధ్యక్షుడు బింగి నవీన్, అడ్‌హాక్ కమిటీ అధ్యక్షుడు వేముల బాలరాజు, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌తో కలిసి ఎన్నికల అధికారికి నామినేషన్ పత్రాలు అందజేశారు.

3 నుంచి సాహిత్యోత్సవ్ జష్న్-ఏ-ఆదాబ్



హైదరాబాద్ సిటీ, జూలై 31 (ఆంధ్రజ్యోతి): హిందుస్తానీ కళలు, సంస్కృతి, సాహిత్యాన్ని వేడుక చేసే అతిపెద్ద సాంస్కృతిక కార్యక్రమాల్లో ఒకటైన సాహిత్యోత్సవ్ జష్న్-ఏ-ఆదాబ్ కల్చరల్ కార్వాన్ విరాసత్ మొదటిసారిగా హైదరాబాద్‌లో జరగనుంది. ఈ కార్యక్రమం ఆగస్టు 3, 4 తేదీల్లో మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ(మనూ)లో నిర్వహిస్తున్నారు. జష్న్-ఏ-ఆదాబ్ వ్యవస్థాపకుడు కున్వర్ రంజీత్ చౌహాన్ మాట్లాడుతూ.. సాంస్కృతికోత్సవంలో దక్కనీ ఉర్దూపై పర్షియన్ ప్రభావంపై చర్చతో పాటు డాక్టర్ విద్యా షా గజల్స్, వార్సీ బ్రదర్స్ ఖవ్వాలి, యామినీరెడ్డి నృత్యప్రదర్శన, ఉర్దూలో శ్రీమద్ భగవద్గీత పఠనం వంటివి ఉంటాయన్నారు.



శంషాబాద్ ఎయిర్‌పోర్టులో ఆందోళన చేస్తున్న క్యాబ్ డ్రైవర్లు

ఇతర రాష్ట్రాల క్యాబ్‌లను అనుమతించొద్దు

- శంషాబాద్ ఎయిర్‌పోర్టులో రెండోరోజూ కొనసాగిన ఆందోళన

శంషాబాద్ రూరల్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): ఇతర రాష్ట్రాల క్యాబ్‌లకు అనుమతివ్వొద్దని డిమాండ్ చేస్తూ శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో క్యాబ్‌డ్రైవర్లు చేపట్టిన ఆందోళన రెండో రోజు బుధవారం కూడా కొనసాగింది. ఈ సందర్భంగా క్యాబ్ డ్రైవర్ల యూనియన్ నాయకులు మాట్లాడుతూ.. కొందరు వ్యాపారులు ఇతర రాష్ట్రాల నుంచి క్యాబ్‌లను తీసుకొచ్చి శంషాబాద్ ఎయిర్‌పోర్టులో నడిపించి తమ జీవనాధారాన్ని దెబ్బ తీస్తున్నారని, తాము రోడ్డున పడే పరిస్థితి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై జీఎంఆర్ అధికారులు, పోలీస్ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని మండిపడ్డారు. ఇతర రాష్ట్రాల క్యాబ్‌లను ఎయిర్‌పోర్టులోకి అనుమతిని రద్దుచేసే వరకు పోరాటం ఆగదన్నారు. అధికారులు సమస్యను పరిష్కరించకపోతే ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు.

డ్రైనేజీ నిర్మాణ పనుల పరిశీలన

నల్లకుంట, జూలై 31 (ఆంధ్రజ్యోతి): సత్యానగర్ బస్తీలో చేపడుతున్న డ్రైనేజీ నిర్మాణ పనులను కార్పొరేటర్ యాకర అమృత బుధవారం పరిశీలించారు. త్వరగా పూర్తిచేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో జలమండలి జీఎం కృష్ణ, ఏఈ దివ్య, జీహెచ్ఎంసీ ఏఈ భావన, బస్తీ అధ్యక్షుడు బి. రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ చేసిన పోలీసు ఉద్యోగులకు ఘనంగా వీడ్కోలు

హైదరాబాద్ సిటీ, జూలై 31 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో ఉద్యోగ విరమణ చేసిన 36 మంది పోలీస్ అధికారులు, సిబ్బందికి బుధవారం సీపీ కె.శ్రీనివాస్‌రెడ్డి ఘనంగా వీడ్కోలు పలికారు. కమిషనరేట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో వారిని సత్కరించారు. పోలీసు శాఖ నుంచి రావలసిన అన్నిరకాల రిటైర్మెంట్ బెనిఫిట్స్ సకాలంలో అందేవిధంగా చూస్తామని, పోలీస్ శాఖ తరఫున మీకు, మీ కుటుంబాలకు ఎల్లవేళలా సహాయ, సహకారం అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో జాయింట్ సీపీ అడ్మిన్ జె.పరిమళ హనా నూతన్, చీఫ్ అకౌంట్స్ అధికారి శ్రీనివాస్, ఏడీఓ శ్రీదేవి, పోలీసు అధికారుల సంఘం అధ్యక్షుడు యన్.శంకర్‌రెడ్డితోపాటు పలువురు పోలీసు అధికారులు పాల్గొన్నారు. సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో బుధవారం ఉద్యోగ విరమణ పొందిన 8 మంది ఉద్యోగులను జాయింట్ సీపీ జోయల్ డేవిస్ సన్మానించారు.



ఉద్యోగ విరమణ చేసిన ఉద్యోగులను సన్మానించిన సీపీ కొత్తకోట శ్రీనివాస్ రెడ్డి



రాష్ట్ర గవర్నర్‌గా బాధ్యతలు స్వీకరించిన జిష్ణు దేవ్‌వర్మను రాజ్‌భవన్‌లో కలిసి అభినందనలు తెలుపుతున్న బీసీ కమిషన్ చైర్మన్ డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు

భారతీయ ఆధ్యాత్మికత ప్రపంచానికి మార్గదర్శకం

- ఉడిపి మఠాధిపతి విద్యాధీశతీర్థ స్వామీజీ

బర్కత్‌పుర, జూలై 31 (ఆంధ్రజ్యోతి): భారతీయ ఆధ్యాత్మికత ప్రపంచానికి మార్గదర్శకం అని ఉడిపి మఠాధిపతి విద్యాధీశతీర్థ స్వామీజీ అన్నారు. బర్కత్‌పుర లింగంపల్లి చౌరస్తాలోని రాఘవేంద్రస్వామి బృందావన సమితిలో మహాభారతం ప్రవచనాల కార్యక్రమంలో భాగంగా బుధవారం సుదర్శన హోమం, ముద్రాధారణ నిర్వహించారు. శ్రీరాముడు, సీత, లక్ష్మణుల విగ్రహాలకు పీఠ పూజ నిర్వహించారు. స్వామీజీ భక్తులకు అనుగ్రహ సందేశం ఇచ్చారు. భారతీయ ఆధ్యాత్మికతకు విశిష్ట స్థానం ఉందన్నారు. ఆధ్యాత్మిక చింతన పెంపొందినప్పుడే సమాజంలో శాంతి నెలకొంటుందన్నారు. మహాభారతాన్ని అనుసరించి ప్రతి ఒక్కరూ సన్మార్గంలో నడవాలని కోరారు.

అక్రమ పదోన్నతులను రద్దు చేయాలి

నల్లకుంట, జూలై 31 (ఆంధ్రజ్యోతి): రోస్టర్ నిబంధనలు ఉల్లంఘించి అక్రమంగా ఇద్దరికి పదోన్నతులు కల్పించడం ఎంతవరకు సబబు అని సెకండ్ గ్రేడ్ టీచర్, దివ్యాంగుడు బూర శ్రీనివాస్ ప్రశ్నించారు. అక్రమంగా ఇచ్చిన పదోన్నతులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. బుధవారం హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను అమలు చేయకుండా నిబంధనలకు విరుద్ధంగా ఎస్‌జీటీ టీచర్లు కుతాడి వనిత, గగులోతు ప్రసాద్‌రావుకు పదోన్నతి ఇచ్చారని ధ్వజమెత్తారు. హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులు అమలు చేయకపోవడంతోపాటు సర్వీస్ నిబంధనలు పాటించకుండా అధికారులు తనకు అన్యాయం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పందించి న్యాయం చేయాలని కోరారు.



మాట్లాడుతున్న బూర శ్రీనివాస్

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

నల్లకుంట, జూలై 31 (ఆంధ్రజ్యోతి): నర్సింహబస్తీకి చెందిన సంజన, తిలక్‌నగర్‌కు చెందిన భాగ్యలక్ష్మికి ఆపరేషన్ నిమిత్తం ఒక్కొక్కరికి రూ. 60 వేల చొప్పున ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరయ్యాయి. కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డి చెక్కులను బుధవారం బీజేపీ కార్యాలయంలో వారికి అందజేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ యాకర అమృత, బీజేపీ నల్లకుంట డివిజన్ కన్వీనర్ కేబీ నర్సింగ్, నాయకుడు కన్నె రమేష్ యాదవ్ పాల్గొన్నారు.

అనాథలకు చేయూతనందించాలి

బర్కత్‌పుర, జూలై 31 (ఆంధ్రజ్యోతి): అనాథలకు చేయూతనందించాలని యువమోర్చా రాష్ట్ర కార్యదర్శి ప్రవీణ్‌కుమార్ కోరారు. బుధవారం అంబర్‌పేట నియోజకవర్గంలో సుధీర్ అనాథాశ్రమంలో విద్యార్థులకు కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అనాథ విద్యార్థులలో ఆత్మస్థైర్యం పెంపొందించడానికి ఆశ్రమాల్లో కేక్ కటింగ్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనాథ విద్యార్థులను ఆదుకోవడానికి స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు.



చిన్నారికి కేక్ తినిపిస్తున్న ప్రవీణ్‌కుమార్

నర్సింగ్ కౌన్సిల్ రిజిస్ట్రార్‌పై ఫిర్యాదు

బర్కత్‌పుర, జూలై 31 (ఆంధ్రజ్యోతి): నర్సింగ్ కౌన్సిల్ రిజిస్ట్రార్‌పై వైద్య, కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శి డాక్టర్ క్రిస్టినా జడ్‌చోంగ్తుకు ఫిర్యాదు చేసినట్లు నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర చైర్మన్ నీల వెంకటేష్ తెలిపారు. బుధవారం కాచిగూడలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నర్సింగ్ కౌన్సిల్ రిజిస్ట్రార్ విద్యావతి 11 ఏళ్లుగా అక్కడే తిష్ఠవేసి విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతుందని ఆరోపించారు. అక్రమాలకు పాల్పడుతున్న రిజిస్ట్రార్‌పై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు శివకృష్ణ, సాయికృష్ణ, మధు, మహేష్, నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

పక్షవాతంతో బాధపడే వారికి ఉచితంగా ఫిజియోథెరపీ

బర్కత్‌పుర, జూలై 31 (ఆంధ్రజ్యోతి): పక్షవాతంతో బాధపడే వారికి ఉచితంగా ఫిజియోథెరపీ చికిత్స అందిస్తున్నట్లు హ్యూమానిటీ ఫౌండేషన్ డైరెక్టర్ డాక్టర్ కొండ శ్రీనివాస్‌రావు తెలిపారు. ఆగస్టు 1 నుంచి 10వ తేదీ వరకు పక్షవాతం, కీళ్లు, మోకాళ్ల నొప్పులకు ఆధునిక పరికరాలతో ఉచిత ఫిజియోథెరపీ చికిత్స, వృద్ధులకు ఉచితంగా ఫిజియోథెరపీ కిట్స్ అందజేస్తామని పేర్కొన్నారు. కాచిగూడలోని ఫౌండేషన్ కార్యాలయంలో చికిత్స చేస్తామని, రాలేని వారికి ఇంటి వద్దనే మొబైల్ ఫిజియోథెరపీ చికిత్స అందిస్తామన్నారు. వివరాలకు 9949238492 ఫోన్ నంబర్‌లో సంప్రదించవచ్చన్నారు.

రైతు రుణమాఫీపై టీజేఎస్ హర్షం

చిక్కడపల్లి, జూలై 31 (ఆంధ్రజ్యోతి): రైతురుణమాఫీ పట్ల తెలంగాణ జనసమితి హర్షం ప్రకటించింది. బుధవారం అశోక్‌నగర్‌లో టీజేఎస్ ముషీరాబాద్ కన్వీనర్ మెరుగు శ్రీనివాస్‌యాదవ్ మాట్లాడుతూ.. రైతులకు లక్షన్నర రుణమాఫీ చేయడంవల్ల వారికి ఎంతో మేలు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో గాంధీనగర్, కవాడిగూడ కన్వీనర్లు గుండెల్లి రవీందర్‌యాదవ్, అజయ్‌గౌడ్, వెంకన్న, నియోజకవర్గం ఎస్టీసెల్ అధ్యక్షుడు వెంకటయ్య పాల్గొన్నారు.

అలరించిన సంగీత విభావరి

చిక్కడపల్లి, జూలై 31 (ఆంధ్రజ్యోతి): నాదం నీ దీవెనే పేరిట నిర్వహించిన సినీ సంగీత విభావరి అలరించింది. శ్రీ సాయి లలిత మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యంలో వాసవీ శ్రీముఖి కాంప్లెక్స్‌లో బుధవారం మధ్యాహ్నం నిర్వహించిన సినీ సంగీత విభావరిలో లలితారావు, డా. టీవీ రావు, నందూరి లక్ష్మణ్, ఫణి, చింతలపాటి మూర్తి, వీణ, రాగరేఖ, ఆమంతలు గీతాలు ఆలపించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎస్‌బీఐ మాజీ ఏజీఎం, గాయకుడు చింతలపాటి త్రినాథరావు గాయనీగాయకులను సన్మానించారు.

తెలంగాణలో టీడీపీకి పూర్వవైభవం ఖాయం

- ఎం. అరవింద్‌కుమార్‌గౌడ్

రాంనగర్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో టీడీపీకి పూర్వవైభవం రావడం ఖాయం అని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు ఎం. అరవింద్‌కుమార్‌గౌడ్ అన్నారు. టీడీపీని బలోపేతం చేయడానికి పార్టీ జాతీయ అధ్యక్షుడు, ఏపీ సీఎం చంద్రబాబునాయుడు కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తారని తెలిపారు. తెలంగాణలో పార్టీ పరిస్థితిపై చంద్రబాబుకు వివరించి బుధవారం నగరానికి వచ్చిన ఆయనను టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం ప్రధాన కార్యదర్శి నల్లెల కిషోర్, నాయకులు వంశీ కృష్ణ, ప్రదీప్‌గౌడ్, శ్యాంసుందర్, నర్సింహులు, భానుప్రకాష్ తదితరులు కలిసి సత్కరించారు.

రైల్వే గార్డ్ బ్యాగు చోరీ

బర్కత్‌పుర, జూలై 31 (ఆంధ్రజ్యోతి): రైల్వే గార్డ్ బ్యాగును గుర్తుతెలియని వ్యక్తులు అపహరించారు. కాచిగూడ రైల్వే పీఎస్ సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం.. నగరానికి చెందిన శ్రీరామ్‌మీణ రైల్వేలో గార్డ్‌గా పని చేస్తున్నాడు. కాచిగూడ - సత్యసాయి ప్రశాంతి నిలయం ఎక్స్‌ప్రెస్ రైలులో పుట్టపర్తి వెళ్తుండగా.. గుంతకల్లు వద్ద అతడి బ్యాగు చోరీ అయింది. అందులో సెల్‌ఫోన్, దుస్తులు ఉన్నాయి. తిరిగి నగరానికి వచ్చిన శ్రీరామ్‌మీణ కాచిగూడ పోలీస్‌స్టేషన్‌లో బుధవారం ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి తదుపరి విచారణ నిమిత్తం గుంతకల్లు రైల్వే పీఎస్‌కు బదిలీ చేశామని సీఐ ఎల్లప్ప తెలిపారు.